


# తీరని సమస్య

'సారపు ధర్మమున్ విమల సత్యము బాపము చేత బొంకుచే
బారము పొందలేక చెడబారినదైన యవస్థ దక్కులె
వ్వారలుపేక్ష చేసిరది వారల చేటగుగాని ధర్మని
స్తారకమయ్యు సత్యశుభదాయకమయ్యును దైవముండెడిన్.'

**శ్రీ కృష్ణుడు** ధృతరాష్ట్రునికి హితబోధ చేశాడు. "సారవంతమైన ధర్మము, నిర్మలమైన సత్యము; పాపము, అసత్యములచే దురవస్థను పొందినప్పటికీ ఏలాగునైనా అవి నిలిచేటట్లు దైవం చూస్తాడు! అధర్మం ఏనాటికీ నిలిచేది కాదు! పాపం ఏనాటికైనా పండి బ్రద్దలవుతుంది!"

ఇంకా శత విధాలుగా బోధ చేశాడు. కాని

**మోసాన్ని మోసంతోనే పరిహరించా లంటారు. కాని, ఎవరు ఎవరిని మోసం చేశారో ఎవరి కెరుక? కనుకనే అన్ని మోసాలను, అన్యాయాలను పరిహరించి న్యాయం చేసేవారు ఉన్నారని పలువురు, ముఖ్యంగా బలహీనులు, బాధితులు నమ్ముతారు.**

---

కౌరవుల చెవికెక్కలేదు. ఫలితం— కురుక్షేత్ర సంగ్రామం! కౌరవ నాశనం!

ధర్మం, సత్యం, న్యాయం, ఏనాటికైనా నిలిచేవి! ఇవి కల్పాంత స్థాయిలు!

లోకంలో పాపాలకు, పాపులకు అంతు ఉండక పోతే ఎలా నిలిచి ఉంటుంది? దైవం ఎప్పటి కప్పుడు సరియైన మార్గం ద్వారా పాప పరిష్కారం చేస్తూ ఉంటాడు.

* * * *

తెల్లగా తెల్లవారుతూంది. సూర్య భగవానుని కిరణాలతో పోటీ చెయ్యలేని చీకటి తనదారి చూసుకుంటూంది. మంచు తెరలు సన్నగా విడిపోతున్నాయి. చల్లగా గాలి వీస్తూంది. రైతులు చల్దులతో పొలాలకు బయలుదేరారు.

దానవయ్యపేట పల్లెటూరు. మహావుంటే మూడు వందల గడప. ఊరులోనికి ప్రవేశిస్తూనే మంచినీటి బావి. పక్కనే పెద్ద వేపచెట్టు. దూరాన ప్రకృతి సౌందర్యాన్ని ఆకళించుకొన్న అందమైన తాటితోపు. ఆ వెనక పచ్చని శోభ కూర్చే పైర్లు.

పైమీద తువ్వాలు, నోటిలో వేపపుల్లతో నూతి వద్దకు వస్తున్న మునసబు రామిరెడ్డికి చెట్టుపక్కనే కొత్తగా లేచిన పాక వింతగా కనిపించింది. 'తనకు తెలియకుండా ఇక్కడ ఈ కొంప ఎలా వచ్చిందా?' అని ఎనలేని ఆశ్చర్యం కలిగింది రెడ్డికి. పక్కనే రోడ్డుమీద మట్టిలో ఆడుకొంటున్న పిల్లవాడిని అడిగాడు.

"ఈ ఇల్లెవరిది?"

"నాకు తెలీదు." కుర్రాడు బెదురుతూ సమాధానం చెప్పాడు.

"లోపలికి వెళ్ళి ఎవరైనా ఉంటే పిలుచుకురా" అన్నాడు.

ఆ మాటల్లో దర్పం, ఠీవి ఎక్కువపాళ్ళు కన్పట్టాయి.

ఆ కుర్రవాడు ముందున్న తలుపు తోసుకుని లోపలికి వెళ్ళాడు.

మునసబు రామిరెడ్డి అంటే ఆ ఊరికి మోతుబరి. ఆ వూరికి పెద్ద లోగిలి కూడా అతనిదే. కరణం, మునసబు చెప్పుచేతుల్లో ఉంటాడు. రామిరెడ్డి ఆకారం పిల్లలకు భయంకరంగా కని

---

## ద్విభాష్యం రాజేశ్వరరావు

---

పిస్తుంది. మెలిపెట్టిన మీసాలు, విశాలమైన నుదురు, బట్టతల, పంచెకట్టు. మనిషి స్వతహాగా మంచివాడు కాడు.

మొహంలో క్రూరత్వమే ఎక్కువపాళ్ళు ప్రత్యక్షమవుతుంది. గ్రామస్థులలో చాలామందికి రెడ్డిమీద సదభిప్రాయం లేని మాట కూడా వాస్తవం.

లోనికి వెళ్ళిన కుర్రాడు మరో వ్యక్తిని వెంట బెట్టుకుని వచ్చాడు. వస్తూనే ఉట్టిపడే వినయంతో నమస్కరించాడు ఆ వ్యక్తి. చిరునవ్వుతో ప్రతినమస్కారంచేసి ఆ వ్యక్తిని ఆపాదమస్తకం పరికించాడు మునసబు. నీర్కావి పంచె, మెడలో యజ్ఞోపవీతం, పైన ఉత్తరీయం ముఖంలో అమాయకత, వింత తేజస్సు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. వయస్సు ఏభై ఏళ్ళకు పైబడి ఉండవచ్చు. ఫాలభాగాన విభూతిరేఖలు.

"నాపేరు శేషశాయి. మొన్ననే ఈ వూరు వచ్చి కరణంగారిని కలుసుకున్నాను. ఏదో బీద వాణ్ణంటే దయతలిచి, ఈ పాక కట్టుకోమన్నారు. మీవద్దకు వెళ్తే సాయంచేస్తారని కూడా చెప్పారు. జీవనాధారం వెతుక్కుంటూ వచ్చాను. దిక్కులేనివాణ్ణి. కనికరించాలి! ఈరోజు మీ దర్శనార్థం వద్దామనుకుంటున్నా!" తన గోడు వెళ్ళబోసుకున్నాడు.

"అలాగా?" అన్నట్లు తల పంకించాడు రెడ్డి.

"సాయంత్రం వచ్చి కనిపించండి" అంటూ నూతివద్దకు వెళ్ళిపోయాడు.

శేషశాయి ఆనందంతో లోనికి వెళ్ళిపోయాడు.

ఆతని ముఖంలో కృతజ్ఞతాపూర్వక భావాలు మెదిలాయి.

ఏ కళనున్నాడో రామిరెడ్డి అంగీకరించాడు. దానితో శేషశాయి జీవితానికి ఒక మార్గం ఏర్పడింది. ఆవూరి ప్రజలలో ఒకడయ్యాడు. ఉదయాన్నే మూడు గంటలకు లేవటం, ఇడ్లీ తయారుచేసి అమ్ముకోవటం, సాయంత్రం ఏదో కొంచెం పురాణం చెప్తూ ఉండటం దినచర్యగా మారిపోయింది.

కాలం గడుస్తూంది. మూడు నెలల్లోనే మునసబు దగ్గర, గ్రామ ప్రజలలో మంచిపేరు సంపాదించుకున్నాడు శేషశాయి. ఆ వూర్లో శేషశాయి అనేకంటే ఇడ్డెన్ల పంతులంటే పిల్లలకు, పెద్దలకు బాగా అర్థమవుతుంది. తన మంచితనంతో సుఖంగా కాలం గడుపుతున్నాడు పంతులు.

* * *

'వెంకటాయపాలెంలో రెండు నెలల క్రితం జరిగిన హత్యకేసు పాఠకులందరికీ సువిదితమే. ఇప్పటివరకూ ఆ కేసు అంతు చిక్కలేదు. ప్రభుత్వం ఆ కేసు దర్యాప్తు సాగించేందుకు సి. ఐ. డి. లను నియమించింది. దర్యాప్తు సాగుతూంది.'

వార్తాపత్రికలో పైవార్త చదివిన శాస్త్రి గుండెలు వేగంగా కొట్టుకున్నాయి.

'ఎక్కడో వెంకటాయపాలెంలో రెండునెలల


పాదాలలో ఆనెలు
పాదాలలో ఆనెలు, కండలు పెరిగి, వేళ్ళు పాతుకపోయి పాదము నేలపై బెట్టలేక రాళ్ళు తగిలిన త్రుళ్ళిపడువారు పైపూతగా వాడినచో వేళ్ళతో సహా మాయంచేయగల సంజీవి పెం పోస్టు ఖర్చులతో రు. 5—50 న. పై.
కొకోక్క కము చిత్రపటములుగలదిరు. 1—50
తెలుగు హిందీ స్వయంశిక్ష రు. 4—50
తెలుగు అంగ భాషాబోధిని రు. 5—00
పోస్టు ఖర్చులు ప్రత్యేకము.
ప్రభ అండ్ కో
3, మలయపెరుమాళ్ వీధి, మద్రాసు-1



శ్రీస్వదేశి ఆభరణములు

శ్రీస్వదేశి గోల్డు కవరింగు వర్క్సు





ఐటెక్స్ కాటుక
ఐటెక్స్ బిందీ (తిలకం)
శాస్త్రీయంగా తయారుచేయుబడినవి
అరవింద్ లేబరేటరీస్
పి. బి. నెం. 1415, మద్రాసు-17.

మెక్లీన్సు టూత్‌పేస్టు యొక్క తాజాయైన,
ఆశ్చర్యకరమైన రుచి అది యీ క్రింది విధముగా
పనిచేస్తోందనుటకు నిదర్శనము !

శుభ్రపరుస్తుంది – పళ్లమీది పసుపుపచ్చని పొరను తీసివేస్తుంది

తెల్లగాచేస్తుంది – పళ్లను ఎక్కువ తెల్లగా చేస్తుంది

రక్షణకలిగిస్తుంది – కుళ్లేలా చేసే సూక్ష్మక్రిములను తొలగిస్తుంది. మీ నోటిని సువాసనతో శుభ్రముగా ఉంచుతుంది.




మెక్లీన్సు – మెరిసే తెల్లని పళ్లకు

MTP/11P/11/65TE


# తీరని సమస్య

క్రితం జరిగిన హత్యకేసుకూ, తనకూ సంబంధం ఏమిటి? ఆ కేసులో సి. ఐ. డి. లను నియమిస్తే మధ్య తనెందుకు భయపడాలి? ఎందుకీ భయం తనకు?' అని ఎంత సర్దిచెప్పుకున్నా వినకుండా మనస్సు గతాన్నంతటినీ తవ్వి బయటకు పోసింది.

దానవయ్యపేట మునసబు రామిరెడ్డికి శాస్త్రి కుడిభుజం లాటివాడు. అంతకంటే శాస్త్రి లేక పోతే రెడ్డి లేడని చెప్పటం అతిశయోక్తి కాదేమో? వీళ్ళిద్దరి మధ్యా రహస్యాలు లేవు. రెడ్డికి హిత మైనా, అహితమైనా బోధించడానికి శాస్త్రి తప్ప ఇంకెవరూ ముందుకు రారు. మొదటిదాని మాట ఎలాఉన్నా, శాస్త్రి రెండవదే ఎక్కువగా బోధిస్తూ ఉంటాడు రెడ్డికి. అతనికి ఏవిధమైన సమస్య వచ్చినా పరిష్కారమార్గం శాస్త్రి చెప్పవలసిందే. మునసబు భూములపై కూడా ఆజమాయిషీ శాస్త్రిదే.

గత సంవత్సరం నీటి వనరు దగ్గర మున సబుకూ, పక్క భూమిలో ఉన్న రైతు రంగ య్యకూ వివాదం వచ్చింది. రెడ్డి తాలూకు మను ష్యులు, రంగయ్య తాలూకు మనుష్యులు కొట్టు కున్నారు. అంతా పెద్ద గోలగా తయారైంది. చివరకు ముఖాముఖిగా రెడ్డి, రంగయ్య మాటా మాటా అనుకున్నారు. చేయికలుపుకోవటం వరకూ వచ్చింది. శాస్త్రి తాత్కాలికంగా సమస్యను పరి ష్కరించి మునసబును ఇంటికి తీసుకొని వచ్చాడు. ఇంటి దగ్గర శాశ్వత పరిష్కార మార్గం మారి పోశాడు. పీడ వదిలిపోయే మార్గం వివరించాడు. పగ తీర్చుకొనే ఉపాయం సూచించాడు. పథకం అమలుజరగటానికి ఎత్తుగడలు బోధించాడు. అంతా విన్న రామిరెడ్డి గుండె ఝల్లుమంది. దుర్మా ర్గుడే అయినా మనసు పిరికిది. దానికి ధైర్యం చేకూర్చటానికి సర్వవిధాల యత్నం చేశాడు శాస్త్రి.

“వద్దు. అటువంటి పనిచేసి దొరికిపోతే ఇంకే మైనా ఉందా?” భయంగా అన్నాడు రెడ్డి.

“రంగయ్యని చంపి మీ పగ తీర్చుకోండి. లేకపోతే ఊళ్ళో అందరికీ మనం అనువైపోతాం. చూశారా, చిన్న వెధవైనా అంతస్తు తెలియ కుండా మిమ్మల్ని ఎలాంటి మాటలన్నాడో? నేనే ఆ స్థానంలో ఉంటే వెంటనే నరికేద్దును. తరువాత ఏమైనా లెక్కలేదు” అన్నాడు ఆవే శంగా శాస్త్రి.

ఈ మాటలు రెడ్డిమీద బాగా పనిచేశాయి.

మానసికంగా శాస్త్రి మాటలకు లొంగి పోయాడు.

**అతనిలోని క్రూరత్వం పైకి లేచింది.**

ఆ రాత్రే రంగయ్య హత్యకాండ ముగించాడు రెడ్డి.

పోలీసు దర్యాప్తు జరిగింది. హంతకుడు పట్టు బడలేదు. కేసు కాలంలో లీనమయిపోయింది.

గతమంతా జ్ఞప్తికి వచ్చిన శాస్త్రికి గుండెలు కొట్టుకున్నాయి. సి. ఐ. డి.ల పేరు చూడగానే మనస్సు ఎందుకో చెప్పరాని భయంతో నిండి పోయింది.

ఒళ్ళంతా చెమటలు పట్టాయి.

ఆలోచిస్తూ వుంటే మనస్సు పరిపరివిధాల పోయింది.

ఇడ్డెన్ల పంతులు మదిలోకి వచ్చేసరికి గతుక్కు మంది.

ఒకవేళ అతడే సి. ఐ. డి. అయితే?

పంతుల్ని తాను ఎన్నోసార్లు గత జీవితం గురించి పృచ్ఛిస్తే అంటీ అంటనట్లు సమాధానం చెప్పాడు.

ఆలోచిస్తున్న కొద్దీ మనస్సు పంతుల్ని సి. ఐ. డి.గా నిశ్చయం చేస్తోంది.

అతని చేష్టలన్నీ అనుమానాస్పదంగా తోచాయి శాస్త్రికి.

'సందేహం లేదు. తాను మొదట్లోనే అనుమానించినా దానికి తావివ్వలేకపోయాడు. ఇప్పటికే చాలా ఆలస్యం అయింది' అనుకున్నాడు.

వెంటనే లేచి బట్టలు వేసుకొని వగుర్చుకుంటూ రెడ్డి ఇంటికి బయలుదేరాడు.

గదిలో కిటికీవద్ద సావధానంగా కూర్చొని చుట్ట కాలుస్తున్న రామిరెడ్డికి శాస్త్రి గాభరా పడుతూ రావటం వింతగానే కనిపించింది.

"ఏమిటోయ్, విశేషాలు?" మామూలు ధోరణితో ప్రశ్నించాడు.

"పీకలమీదకు వచ్చేవరకూ మనకు తెలియనే లేదు! కొంపలంటుకున్నాయ్!" అన్నాడు గాభరాగా.

మునసబుకు కూడా కంగారు పుట్టింది.

"ఏమైంది?" అన్నాడు ఆత్రంగా.

శాస్త్రి. పక్కనున్న కుర్చీ దగ్గరగా లాగి, మొహం తుడుచుకుంటూ కూలబడ్డాడు. మెల్లిగా అన్నాడు:

"ఆ ఇడ్డెన్ల పంతులు లేడూ? వాడు సి. ఐ. డి. అని అనుమానంగా ఉంది. వాడి చేష్టలు ఈమధ్య గమనిస్తున్నా. ఈ పేపరు చూశారా? వెంకటాయపాలెంలో సి.ఐ.డి. లను నియమించారట. వీడుకూడా అలాంటివాడే! సందేహం లేదు." తన అనుమానాన్ని స్పష్టపరిచాడు శాస్త్రి.

మునసబు గుండెల్లో రాయి పడింది.

"సి. ఐ. డి. యా?" అని నోర్లు తెరుచుకొని ఆశ్చర్యంతో ఉండిపోయాడు.

ఆశ్చర్యంలోంచి తేరుకొనేసరికి రెండు నిమిషాలు పట్టింది.

"అయితే ఇప్పుడు ఏం చెయ్యటం?" నిస్సహాయంగా అన్నాడు.

"నేనూ అదే యోచిస్తున్నా! అంతు చిక్కటం లేదు."

రెడ్డికి బుర్రలో ఆలోచనలు ఈగల్లా ముసురుకున్నాయి.

'అవును! పంతులు తనను ఎంతలా నమ్మించాడు! తన పరిస్థితి కొరివితో తల గోక్కున్నట్లుంది. తను మోసపోయాడు. తెలియకుండా ఆశ్రయమిచ్చి పీకలమీదకు తెచ్చుకున్నాడు.అందు వలననే గతం ఎంత ప్రశ్నించినా చెప్పలేదు పంతులు' అనుకున్నాడు మనసులో.

"ఏమిటాలోచిస్తున్నావ్!" అన్న శాస్త్రి ప్రశ్నతో తేరుకున్నాడు.

"ఏం పాలుపోవటంలేదు!" అయోమయంగా వెర్రి చూపులు చూస్తూ అన్నాడు.

"నాకు ఒక ఆలోచన తోస్తోంది" అంటూ ముందుకు వంగి మెల్లిగా చెప్పాడు.

అది విన్న రెడ్డి మరీ కంగారుపడ్డాడు.

"ఇంకేమైనా ఉందా! ఏదో అదృష్టంకొద్దీ క్రితంసారి తప్పించుకున్నాం. దానిమీద దర్యాప్తు జరుగుతోందనే భయపడుతున్నాం! మళ్ళీ మరొక హత్యా? ఇక మనకు లోకంలో నూకలు ఉండవు" అన్నాడు గాభరాగా.

"వేరు మార్గం కనిపించటంలేదు." భారంగా నిట్టూర్చుస్తూ అన్నాడు "నీకెందుకూ? నేను చేయిస్తాగా? పాత పాపం బయటపడితేమాత్రం పీకలమీదకు రాదూ? ఎలాగా ఇంతవరకూ సాహసించాం. నిండా మునిగాక మనకు చలేమిటి? ధైర్యంగా ఉండు."

రెడ్డికి మాత్రం ధైర్యం కలగలేదు. గుండె పీకుతూనే ఉంది.

"అవసరంగా కావాలి. రెండు వందలు ఇలా పారెయ్!" అన్నాడు నిల్చుంటూ శాస్త్రి.

"ఏమిటో చాలా భయంగా ఉంది" అంటూ డబ్బు ఇవ్వడానికి లేచాడు రెడ్డి.

ఆ మరుసటి రోజంతా 'పంతుల్ని అంతం చెయ్యటమెలాగా?' అనే ఆలోచనలోనే మునిగిపోయాడు శాస్త్రి. అనేకపథకాలు ఆలోచించాడు. కాని అన్నీ ప్రమాదంతో కూడుకున్నవే. మెరుపులాంటి ఒక్క ఆలోచన తట్టింది. తన తెలివికి తానే అభినందించుకున్నాడు.

'ప్రతిరోజూ ఉదయం మూడింటికి పంతులు పొయ్యి అంటిస్తాడు, ఇడ్లీలు తయారు చెయ్యటం కోసం. అతడు లేవటానికి ముందుగా తలుపులు బిగించి ఇంటికి నిప్పెట్టెయ్యాలి. ప్రమాదవశాత్తు ఇడ్లీల పొయ్యివల్ల తగులబడి పోయిందని అందరూ భావిస్తారు. పోలీసులకు కూడా అదే కారణం చూపించవచ్చు. మొత్తంగా పీడ వదిలిపోతుంది' అనుకున్నాడు.

పథకం బాగా కుదిరింది. అమలు చెయ్యటంలో ఉంది.

రెడ్డికి ఈ ఆలోచనను బోధపరిచాడు.

"అమోఘంగా ఉంది!" అంటూ శాస్త్రి బుర్రను మెచ్చుకున్నాడు రెడ్డి.

"ఆలోచన చాలా చక్కగా ఉంది. కాని రేపు చాలా జాగ్రత్త వహించాలి. సరియైన మనుష్యుల్ని చూడు.. ఇద్దరైతే చాలు. పనిపూర్తి చేసేస్తారు. చెరో యాభై పారెయ్!" అంటూ మరో వంద రూపాయలు తీసి ఇచ్చాడు.

"రేపు తెల్లవారుఝామునే పని పూర్తి చేయిస్తా" అంటూ డబ్బు తీసికొని వెళ్ళిపోయాడ శాస్త్రి.

ఆ రాత్రి పండుకున్నాడన్న మాటేగాని నిద్ర పట్టలేదు రెడ్డికి. మనస్సు పరిపరివిధాలపోతూంది తన స్వాధీనంలోంచి తప్పిపోయింది. ధైర్యంగా శాస్త్రితో మాట్లాడినా గుండెమాత్రం పిరికితనంతో పీకుతూంది. తను ఆశ్రయ మిచ్చి ఆధారం చూపిన మనిషిని తానే హత్య చేయిస్తున్నాడు.

ఒక తప్పు కప్పుకోవటంకోసం ఇంకో తప్పు చెయ్యవలసి వస్తోంది.

ఒక హత్యానేరాన్ని కప్పిపుచ్చటానికి మరో హత్య.


ఈ దారుణకాండ ఎంతవరకూ సాగాలి?

ఈ భయంకర హత్యలు ఇంకా ఎన్ని జరగాలి?

మనస్సు అల్లకల్లోలమైంది.

పంతులే నిజంగా సి. ఐ. డి. అయితే?

అతని మరణానికి తప్పకుండా చర్య తీసు



## కాననమధ్యంలో

రం—సిహెచ్. అప్పలరాజు
(విజయనగరం—1)

కుంటారు.

అప్పుడు మాత్రం దొరకడనే నిర్ధారణ ఏమిటి?

పట్టుబడితే తనగతేం కావాలి?

మరణదండన... ఉరి... అంతకంటె చిన్న శిక్ష ఏమిటి?

ఒళ్ళంతా చెమటలు పట్టింది.

తేళ్ళు, జెర్రులు పాకినట్లయింది.

మనస్సు మొద్దుబారి పోయింది. మెదడు పని చెయ్యలేదు.

ఇంతకూ పంతులు సి. ఐ. డి. కాకపోతే?

అన్యాయంగా బ్రాహ్మణ్ణి చంపించిన పాతకం చుట్టుకుంటుంది.

ఒక అమాయకుణ్ణి బలిగొన్నట్లవుతుంది.

మొదటి రోజున తనకు కనిపించిన శేషశాయి ఆకారం జ్ఞప్తికి వచ్చేసరికి మనసు కరిగి నీరైంది.

నీర్కావిపంచె, నుదుట విభూతిరేఖలు,



కిసాన్
లాంతరు
ఈ రకపువాటిలో ఉత్తమమైనది
అన్ని పెద్ద స్టోర్లలోను లభిస్తుంది
గౌర్ మోహన్ దాస్ & కం.,
233, పాత చైనాబజార్ వీధి, కలకత్తా-1.
ఫోన్: 22-6580.

ఛాంపియన్
బనియన్లు




CHAMPION KNITTING
COMPANY,
KALLAMPALAYAM ROAD
TIRUPUR.


# తీరని సమస్య

అమాయకత స్పష్టంగా ఉట్టిపడే మొహం....

ఇక ఆలోచించలేకపోయాడు.

మగతగా నిద్ర పట్టింది.

భయంకరంగా అగ్నిజ్వాలలు—మధ్య వణికి పోతున్న పంతులు—దీనంగా ప్రార్థిస్తున్నాడు:

"బాబూ! నేను మీకు ఏం ద్రోహం చేశాను? ఎందుకు నన్ను నిలువునా కాల్చేస్తారు? ఎందుకీ శిక్ష? కలలోనైనా మీకు హాని తలపెట్టలేదే! నాకు నిలువ నీడనిచ్చి బ్రతకడానికి ఆధారం కల్పించి, పెంచి, మళ్ళీ మీచేతులతోనే అంతం చేస్తారా? కనికరం లేదా? అమాయకుణ్ణి! నాకేం తెలియదు. నాకు పోలీసులతో సంబంధంలేదు. మీరు మంచివారని మిమ్మల్ని ఆశ్రయించాను! నన్ను నమ్మండి."

మునసబు నిద్ర చెదిరిపోయింది.

ఒడలంతా భయంతో కంపించింది

కంటిమీద కునుకురాలేదు.

భయంతోనూ, పంతులుమీద జాలితోనూ మనస్సు నిండిపోయింది.

'నిజం తెలియకుండా చంపెయ్యటం కంటె పంతులు దగ్గరకు వెళ్ళి నిలదీసి అడిగితే? అతని ఇల్లు సోదాచేస్తే? అనుమానాస్పదమైన విషయాలు గోచరిస్తే అక్కడే చంపెయ్యొచ్చు! లేకపోతే ప్రాణం తియ్యకుండా వదిలెయ్యవచ్చు. పంతుల్ని అడిగితే?' అనుకున్నాడు.

అదే మంచి ఆలోచనగా తోచింది.

వెంటనే మంచం దిగి బట్టలు వేసుకున్నాడు.

టైము రెండు కావస్తోంది.

చేతికర్ర తీసుకొని పంతులు ఇంటివైపు నడక సాగించాడు.

కాటుకలాటి చీకటి నిశీథిలో తాండవం చేస్తోంది.

దూరాన నక్కలు వికృతంగా అరుస్తున్నాయి.

పంతులు ఇల్లు చేరుకున్నాడు. ఇంటిపక్కనే ఉన్న వేపచెట్టు గాలికి తలఊపుతూ వికృతంగా శబ్దం చేస్తోంది.

పాకలోంచి చిన్న వెలుతురు తలుపు సందుగుండా బయటకు వస్తోంది.

మెల్లిగా తలుపు తట్టాడు.

తట్టగానే చిన్న శబ్దంతో తలుపు తెరుచుకొంది.

మెల్లిగా తలుపు దగ్గరపెట్టి లోనికి వెళ్ళాడు.

ఎదురుగా మట్టితిన్నెమీద దీపం గుడ్డిగా వెలుగుతూంది.

పక్కనే మంచం ఖాళీగా ఉంది.

లోపల అంతా కలయజూచాడు.

పంతులు ధరించే బట్టలుకూడా ఎక్కడా కనిపించలేదు.

'ఈ అర్ధరాత్రి సమయంలో పంతులు ఎక్కడికి వెళ్ళినట్లు?' అనుకున్నాడు. లోపల నాలుగు మూలలా కలియ వెదికాడు. ఏవీ అనుమానాస్పదమైన విషయాలు కనిపించలేదు.

దీపం పక్కనే గాలికి రెపరెపలాడుతున్న కాగితం రెడ్డి దృష్టి నాకర్షించింది. ఆత్రుతగా కాగితాన్ని విప్పి చూశాడు. దీపం కాంతిలో తనకు వ్రాసిన ఉత్తరం స్పష్టంగా కనిపించింది.

"గౌరవనీయులైన రామిరెడ్డిగారికి,

ఈ ఉత్తరం చదివి నామీద ఆగ్రహించకుండా నన్ను సహృదయంతో క్షమిస్తారని తలుస్తున్నాను. మీరు నాకు చేసిన మేలు ఈ జన్మలో మరవలేను. మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి.

ఈ మూడు నెలలు చాలా గుట్టుగా నా జీవితాన్ని గడిపాను. నా గతాన్ని గురించి మీకు చెప్పాలంటే అభిమానం అడ్డవచ్చేది. నేను పెద్దగా బ్రతికిన వాణ్ణి. కాని జీవితంలో ఆర్థికంగా చాలా దెబ్బలు తిన్నాను. ఆస్తి సర్వస్వాన్ని కోల్పోయాను. పెద్దబ్రతుకు బ్రతికిన వాణ్ణవటంచే యాచించుకోలేకపోయాను. పువ్వులమ్మిన ఊళ్లో కట్టెలమ్మటం ఇష్టం లేకపోయింది. దూరంగా వెళ్ళి కొంతకాలం బ్రతుకుదామని నిశ్చయించుకొని మిమ్మల్ని దర్శించాను. మీరు అభిమానంతో నన్ను ఆదుకున్నారు. మీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియటం లేదు. నిన్ననే నా కుమార్తె వద్దనుంచి ఉత్తరం వచ్చింది. ఆమెవద్ద నా శేష జీవితాన్ని గడపటానికి నిశ్చయించుకొన్నాను. మీ సామానంతా వదిలిపెట్టి వెళ్ళిపోతున్నా. చెప్పకుండా వెళ్ళినందుకు క్షమిస్తారని ఆశిస్తున్నా.

సర్వదా కృతజ్ఞుణ్ణి.

శేషశాయి."

ఉత్తరం చదువుతూ ఉంటే అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు జారాయి. మనసు ద్రవించిపోయింది.

ఉత్తరం పట్టుకుని బయటకు నడిచాడు.

తలుపు లాగాడు.

తెరుచుకోలేదు!

బయట గొళ్లెం పెట్టి ఉంది.

బలంగా తన్నాడు.

అప్పుడు జ్ఞప్తికి వచ్చింది. ఒళ్ళంతా కంపించిపోయింది. పైప్రాణాలు పైకెగిరి పోయాయి. నిస్సహాయంగా కూలబడిపోయాడు. అప్పటికే పొగలు కమ్ముకుంటున్నాయి.

వెర్రిగా కేకలు పెట్టాడు. అరిచాడు.

లాభం లేకపోయింది.

చూస్తూండగానే అగ్నిజ్వాలలు లేచాయి. ఆకాశాన్నంటాయి.

పాపం ఈనాటికి పండింది. బద్దలయింది.

ధర్మం, న్యాయం నిలిచాయి.

అవి కల్పాంత స్థాయిలు.

• • •

మరునటిరోజు పంతులు మరణానికి కన్నీరు పెట్టనివాళ్ళు లేరు. కాని మునసబు ఊళ్ళో కనబడకపోవటం మాత్రం నాటికీ నేటికీ సమస్యగా నిలిచిపోయింది ఆ గ్రామస్థులకు. ★